బంజారాల ఇలవేల్పు సిట్ల దేవతలు

వెంకటేశ్వరకాలనీలో కొలువుదీరిన ఏడుగురు అక్కాచెల్లెళ్లు

- జమ్మిచెట్టు నీడన పూజలు
- కొలిచిన వారికి కొంగుబంగారం
- నిత్యం పూజాధికాలు

బంజారాహిల్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చెట్టు, పుట్ట, రాయి, రప్ప ప్రకృతి ఒడిలో జీవనాధారమైన ప్రతీది వారికి ఇలవేల్పే. కష్టం వచ్చినప్పుడు, ఆపద సంభవించినప్పుడు ఆ ప్రకృతి నుంచి పుట్టిన నమ్మకమే సిట్ల దేవతలు. జమ్మిచెట్టు కింద వెలిసిన అమ్మలను కొలిస్తే కొంగు బంగారం అవుతుందన్న గిరిపుత్రుల నమ్మకం. సిట్ల దేవతలు వారి ఇలవేల్పుగా కొలుస్తున్నారు. గుడికట్టి పూజలు చేస్తున్నారు. బోనాలు వచ్చాయంటే చాలు ఆలయాల వద్ద బంజారాల సంస్కృతి తాండవిస్తోంది. ఇలాంటి భిన్న సంస్కృతిని కనులారా చూసేందుకు ఎక్కడికో అడవుల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదు. ధనవంతులు ఉండే బంజారాహిల్స్ నడిబొడ్డునే ఏడుగురు అక్కచెల్లెళ్లుగా సిట్ల మాత కొలువుదీరింది. ప్రతియేటా బోనాల సందర్భంగా ఈ ఆలయంలో బంజారాల పూజలు చూసి దర్శించేందుకు రోడ్డు నెంబర్.14లోని వెంకటేశ్వరకాలనీకి వేలమంది తరలివస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విభిన్న తరహాల బోనం సమర్పిస్తూ బంజారాలు ఆకట్టుకుంటారు. గ్రామాల్లో జమ్మి చెట్టు కింద రాళ్లను ప్రతిష్ఠించి అమ్మవార్లుగా కొలుస్తారు. కానీ, ఇక్కడ ఏడుగురు అమ్మవార్లను విగ్రహాల రూపంలో ఏర్పాటు చేయడంతో మరింత ప్రత్యేకతను చాటుకుంటోంది.

వంద సంవత్సరాల చరిత్ర

సిట్ల మాత ఆలయానికి వంద సంవత్సరాల చరిత్ర ఉన్నదని పూర్వీకులు అంటున్నారు. గతంలో హిల్స్‌లో బంజారాలు జీవనోపాధి కోసం వ్యవసాయం చేసేవారు. బంజారా చెరువు మళ్లించుకుంటూ పంట పండించుకునేవారు. ప్రస్తుతం భాగ్యనగర్ స్టూడియో ఉన్న ప్రాంతంలో దట్టమైన అడివి ఉండేది. దానికి మధ్యలో జమ్మిచెట్టు నీడన ఏడు రాళ్లు ఒకదాని పక్కన ఒకటి ప్రతిష్ఠించినట్టుగా వరుసగా ఉండేవి. బొజ్యానాయక్ అనే బంజారా నాయకుడు ఓ సారి జమ్మిచెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటడగా రాళ్లు కంటపడ్డాయి. జమ్మిచెట్టు కింద ఉన్నాయి కాబట్టి తమ కుల ఆచారం ప్రకారం అవి సిట్ల మాతవేనని నమ్మకం ఏర్పడింది. అదేరోజు అక్కడ జాతర నిర్వహించి తమ కులదైవంగా పూజించడం మొదలు పెట్టారు. పొలం పనులకు వచ్చే లంబాడాలు అమ్మవారికి నైవేద్యం పెట్టిన తర్వాతే వారు భుజించేవారు. అలా కొద్ది కాలం జమ్మి చెట్టు నీడనే పూజలు జరిగాయి. తర్వాత అది ప్రైవేట్ స్థలమని కొంత మంది ఆలయం చుట్టూ ఉన్న ప్రాంతంలో కంచె వేశారు. దీంతో లాలునాయక్ అనే నాయకుడు అమ్మవారి విగ్రహాలను సమీపంలోని తనకు సంబంధించిన



ఆలయంలో కొలువుదీరిన అమ్మవార్లు

ఖాళీ స్థలంలో నెలకొల్పాడు. ఇప్పుడు అదే ప్రాంతం వెంకటేశ్వరనగర్‌గా ఆవిర్భవించింది. మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ అమ్మవార్లకు ఆలయం నిర్మించి విగ్రహ రూపంలో ప్రతిష్ఠించారు. ఏడుగురు అక్కాచెల్లెళ్లు ఒక దగ్గరే కొలువుదీరి ఉండగా, ప్రతీ నిత్యం పూజాధికాలు నిర్వహిస్తారు.

కన్నెపిల్లతో బోనం..

ఏడుగురు అక్కాచెల్లెళ్లుగా కొలువుదీరిన సిట్ల మాతకు ఇప్పటికీ బంజారాల సంస్కృతి ప్రకారం బోనాల జాతర నిర్వహిస్తారు. పెళ్లి కాని కన్నె పిల్ల చేత అమ్మవారికి



వెంకటేశ్వరనగర్‌లోని సిట్ల మాత ఆలయం

బోనం సమర్పిస్తారు. లంబాడ సంస్కృతి దుస్తులు ధరించి యువతి అమ్మవారికి బోనం సమర్పిస్తుంది. బోనంలో ఉల్లిపాయ,జొన్నలు, బెల్లంతో చేసిన పర్వాన్నం అమ్మవారికి నైవేద్యంగా చూపిస్తారు.

సిట్ల మాతకు రాష్ట్రంలో మొదటి ఆలయం

బంజారాల ఇష్టదైవం సిట్ల మాత. రాష్ట్రంలోనే బంజారాహిల్స్‌లో ఉన్న ఆలయం మొదటిది. గిరిజనులు ఉండే ప్రాంతాల్లో జమ్మిచెట్టు కింద రాయి రూపంలో ఉన్న దేవతలను కొలుస్తారు. ఇక్కడ మొదట ఇలాగే పూజలు జరిపాం. కాలక్రమేణా ఆలయం అభివృద్ధి చెందింది. అమ్మవార్లను విగ్రహ రూపంలో చూడడం ఆనందంగా ఉంది. పండుగలు, బోనాల సమయంలో అమ్మవారికి మా సంప్రదాయం ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తాం.

- లక్ష్మీబాయి, స్థానికురాలు

బోనాలు వస్తే మా ఊర్లో ఉన్నట్టే..

బోనాలు వస్తే చాలు సిట్ల మాత ఆలయంలో వేడుకలు చాలా బాగా జరుగుతాయి. ఊళ్లలో తరహాతో పాటు మరింత కనుల పండువగా జరుగుతాయి. హైదరాబాద్‌లో మా సంప్రదాయం ప్రకారం ఆలయం ఉండడం ఆనందంగా అనిపిస్తుంది. ఇక్కడివాసులకు బంజారా సంస్కృతిని చాటే అవకాశం కలిగింది.

- ఉమ్లీబాయి, స్థానికురాలు

ఎర్రగడ్డలో వైభవంగా బోనాలు



ఎర్రగడ్డ మహంకాళి ఆలయంలో అమ్మవారికి నైవేద్యం పెడుతున్న మహిళలు

ఎర్రగడ్డ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలో ఆషాఢమాసం చివరి గురువారం నిర్వహించే బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల వీరంగం విశేషంగా అలరించాయి. పొట్టేలు ముందు నడుస్తుండగా ఫలహారం బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఫలహారం పండ్లను ఏర్పాటు చేశారు. సుల్తాన్ నగర్, ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ, ఓల్డ్ సుల్తాన్‌నగర్, ఛత్రపతి శివాజీ నగర్, బంజారానగర్, ఆనందనగర్, న్యూ ప్రేమ్‌నగర్, ప్రేమ్‌నగర్ కుంట తదితర బస్తీల నుంచి మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఫలహారం బండ్ల ఊరేగింపు

పోతరాజులు వీరంగం సృష్టించారు. చిర్రగోల చేతపట్టుకొని, ఓం నమ: శివాయ అంటూ పరుగులు తీస్తూ వీరంగాన్ని సృష్టించారు. ఫలహారం బండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. డీజేలతో మార్మోగించారు. శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు శశి కుమార్, మామిడి హనుమంతరావు, సాయికృష్ణ ఆధ్వర్యంలో ఫలారం బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. బిజిలి మహంకాళి అసోసియేషన్, మురళీధర్ భక్తసమాజము మండలి, ఓం కల్చరల్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఊరేగింపులు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నారాయణ స్వామి, సలహాదారు కె. ఆనంద్ యాదవ్, కోశాధికారి శ్రీనివాస్‌గుప్తా, సభ్యులు కె.విజయ్ యాదవ్, విజయ్ కుమార్‌గౌడ్, మహేందర్, అశోక్,



బోనాలతో బయలుదేరిన మహిళలు

మహేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివ యాదవ్, స్థానిక నాయకులు ఎర్ర కృష్ణ కుమార్, డి.రవిగౌడ్, మహేందర్, కిరణ్ కుమార్, ఎస్ఎస్‌కే రాజు, పెగడ ఆకాష్, శ్రీకాంత్, ధన్‌వీర్, నాను, శశి కుమార్, ఉమ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బ్యాగు అందజేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

బంజారాహిల్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని టీపీసీసీ నాయకురాలు, కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆమె బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధన్‌రాజ్ రాథోడ్, జీవన్‌రాజ్, ఉదయ్‌యాదవ్, యాదగిరి ముదిరాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



పారిశుధ్య సిబ్బందికి పీపీఈ కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

పీపీఈ కిట్ల పంపిణీ

బంజారాహిల్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్‌లో గురువారం పారిశుధ్య సిబ్బందికి పీపీఈ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



గర్భిణులతో అనిల్‌కుమార్

గర్భిణులకు చీరలు, పండ్లు పంపిణీ

బంజారాహిల్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సత్య కుసుమ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని సింగాడబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు చీరలతోపాటు పండ్లు, పోషకాహారం కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ జవ్వాది అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం తమ ట్రస్టులో ఉండే సభ్యులు ముఖ్యమైన రోజులను సమాజంలోని పేద వారి మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు చీరలతోపాటు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే, అంగన్‌వాడీ స్కూల్‌లోని 40 మంది పిల్లలకు స్కూల్ బ్యాగులు, పలకలు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఖైరతాబాద్ ఏడుగుళ్లు, మహంకాళి ఆలయాలు ముస్తాబు

ఖైరతాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఏడుగుళ్ల ఆలయంతో పాటు మహంకాళి ఆలయాలను ఆదివారం నిర్వహించే బోనాల వేడుకలకు ముస్తాబు చేశారు. ఖైరతాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది ఈ ఆలయాల్లో బోనాలు సమర్పిస్తుంటారు. ఇప్పటికే పెయింటింగ్ పనులు పూర్తి కాగా, విద్యుత్ వెలుగులతో సుందరంగా ముస్తాబు చేశారు. మహంకాళి ఆలయంలో వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పలువురు మంత్రులను ఆహ్వానించామని ఆలయ చైర్మన్ భవాని కృష్ణయాదవ్, టీపీసీసీ కార్యదర్శి మధుకర్ యాదవ్ తెలిపారు. కాగా, స్థానిక గజ్జెలమ్మ ఆలయం, ఇందిరానగర్ కాలనీలోని నల్లపోచమ్మ, మారుతీనగర్ భూలక్ష్మమ్మ ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఖైరతాబాద్ మహంకాళి ఆలయం అలంకరణలో నిర్వాహకులు



లక్ష్మి కుమార్తెకు ఎల్‌ఓసీ అందజేస్తున్న తలసాని

పేదలకు మెరుగైన వైద్యం : తలసాని

అమీర్‌పేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు తాను ముందుంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం తన నివాసంలో అమీర్‌పేట డివిజన్ బీజేఆర్ నగర్‌కు చెందిన ఉగాది లక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని ఆమె కుమార్తెకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు హన్మంతరావు, అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, కూతురు నర్సింహ, కట్టా బలరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ఎమ్మెల్యే కాలనీ షాపింగ్ కాంప్లెక్స్, రహ్మత్ నగర్ గురుద్వార, ఇంజనీర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఏసీబీ కార్యాలయం, జూబ్లీహిల్స్ సెలబ్రేషన్ హోటల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

పంజాగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం యూసుఫ్‌గూడ బస్తీలోని లేబర్ అడ్డా వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను ఉల్లంఘించిన యజమానులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలని, మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమణ, రమేష్, సత్యనారాయణ, ప్రకాష్, రాము పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు

పంజాగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దురుద్దేశంతోనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హైదరాబాద్ సెక్యూరిటీస్ అండ్ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్(హెచ్ఎస్ఈఎల్) మాజీ చైర్మన్ శివకుమార్ అన్నారు. గురువారం ఎర్రమంజిల్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒప్పందం ప్రకారమే తమ స్థలంలో నిర్మాణ సంస్థ నిర్మాణాలు చేపట్టిందని, అందరికీ న్యాయబద్ధంగా రావాల్సిన షేర్స్ ఇచ్చామని చెప్పారు. తమ సంస్థపై బురదజల్లేందుకే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఆరోపణలు చేస్తున్న వారు గతంలో న్యాయస్థానాలను ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పులు వెలువడ్డాయని తెలిపారు. గవర్నర్, సంబంధిత శాఖ మంత్రి, మున్సిపల్ అధికారులు, ఐటీ, ఈడీ, ఏసీబీతోపాటు ఎన్‌సీఎల్‌టీ వంటి విచారణ సంస్థలకు ఫిర్యాదులు చేయగా ఆయా సంస్థలు కోరిన అన్ని పత్రాలను అందజేసినట్లు చెప్పారు. నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ)లో పలుమార్లు ఫిర్యాదు చేయడం, ఫిర్యాదుదారులే ఫిర్యాదులు వెనక్కి తీసుకోవడం జరిగిందని తెలిపారు. తాము ఎవరికీ అన్యాయం చేయలేదని, అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మాజీ సీఎం బంధువునంటూ స్థలం కబ్జా

హైదర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి రోశయ్య బంధువునంటూ ఓ మహిళ తమ స్థలాన్ని కబ్జా చేసిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని స్థల యజమాని ఖాజా షజావుద్దీన్ కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మబండలో సర్వే నంబర్ 57లో తమకు చెందిన స్థలాన్ని రేణిగుంట్ల శ్రీదేవి అనే మహిళ ఆక్రమించి ఐదంతస్తుల భవనం నిర్మిస్తోందని తెలిపాడు. ఆమెపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు. తాను మాజీ ముఖ్యమంత్రి రోశయ్య బంధువునంటూ బెదిరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అటువైపు కన్నెతి చూడం లేదని ఆరోపించాడు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రివర్స్‌లో వచ్చి ఢీ కొట్టాడు

యూసుఫ్‌గూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వెనకకు రివర్స్ వస్తూ బొలెరో వాహనం ఇన్నోవాను ఢీకొట్టింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మశంకర్ నగర్‌కు చెందిన అడివయ్య ఇన్నోవా కారు(ఏపీ09డిఎస్ 9764)లో అమీర్‌పేటకు బయలు దేరాడు. రహ్మత్ నగర్ చౌరస్తా వద్దకు రాగానే బొలెరో వాహనం(ఏపీ 28టిసి 5013) వెనకకి వస్తూ ఢీ కొట్టింది. దీంతో ఇన్నోవా కుడివైపు డోరు డ్యామేజ్ అయింది. బొలెరో డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని అడివయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జవహర్ నగర్‌లో బీటీతో గుంతలు పూడుస్తున్న సిబ్బంది

రహదారులకు మరమ్మతులు

వెంగళరావునగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయిస్తున్నామని స్థానిక కార్పొరేటర్ దేదీప్య తెలిపారు. గురువారం జవహర్ నగర్‌లో రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌ను ఆమె ప్రారంభించారు. గడిచిన 18 నెలలుగా రహదారులపై పడ్డ గుంతలను పూడ్చడానికి బీటీ లేకపోవడంతో గతుకులు, గుంతల రోడ్లపై ప్రయాణిస్తూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం బీటీ అందుబాటులో ఉండడంతో గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేయాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శికి గురువారం వినతిపత్రం అందజేశారు. లైసెన్స్ రెన్యూవల్ చేయకపోవడంతో టెండర్లలో పాల్గొనలేకపోతున్నామని, బిల్లులు పెట్టుకోలేకపోతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల కోసం ఎలక్ట్రికల్ ఏ గ్రేడ్, బీ గ్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని, సూపర్‌వైజర్ పర్మిట్, వైర్‌మన్ పర్మిట్ రెన్యూవల్ చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు మనోవేదనకు గురవుతున్నారని, వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అనాస పండ్లతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

అమీర్‌పేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ తల్లి రోజుకో అలంకరణలో ముస్తాబవుతూ భక్తులకు దర్శనం ఇస్తున్నారు. గురువారంఅమ్మవారి మూల విరాటలను అనాస, (పైన్ యాపిల్) జామ పండ్లతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



అనాస, జామ పండ్లతో అలంకృతురాలైన ఎల్లమ్మ మూల విరాట్

భవనంపై నుంచి పడి వృద్ధురాలు మృతి

ఖైరతాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ వృద్ధురాలు భవనం పై నుంచి పడి మృతిచెందింది. ఈ సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనందనగర్ కాలనీ సాయిసూర్య స్వర్ణప్రకాష్ రెసిడెన్సీ నాలుగో అంతస్తు ఫ్లాట్ నెంబర్.401లో డాక్టర్ మేడిశెట్టి నవీన్ కుమార్, శ్రీదేవి దంపతులు నివసిస్తున్నారు. వీరితో పాటే శ్రీదేవి తల్లి, క్యాన్సర్‌తో బాధపడుతున్న గుత్తి భ్రమరాంబ(64) ఉంటున్నారు. వారానికి రెండుసార్లు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. కాగా, గురువారం ఉదయం డాక్టర్ నవీన్ కుమార్ పనిపై బయటకు వెళ్లారు. 9 గంటల సమయంలో శ్రీదేవి పిల్లలను స్కూల్‌లో దింపేందుకు వెళ్లారు. ఆ సమయంలో భ్రమరాంబ ఒక్కరే ఇంట్లో ఉండగా శ్రీదేవి పని ముగించుకొని ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ నొక్కినా తలుపు తెరవలేదు. దీంతో ఆమె ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌కు ఫోన్ చేసినా తీయలేదు. ఇంతలో అపార్టుమెంట్ వాచ్‌మన్ వచ్చి మీ తల్లి కిందపడిపోయారని తెలపడంతో శ్రీదేవి వెళ్లి 108లో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, తమ తల్లికి ఈ మధ్యకాలంలో కళ్లు సరిగా కనిపించడంలేదని, కిచెన్ వాష్ ఏరియా వద్ద ఉన్న గ్రిల్ తక్కువ ఎత్తులో ఉన్నందున అక్కడి నుంచి జారి పడిపోయి ఉండవచ్చునని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని ఏఎస్ఐ రవీందర్ తెలిపారు.



భ్రమరాంబ(ఫైల్)

ప్రేమ విఫలమై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

రాయదుర్గం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన ప్రమోద్, హితేష్(29), చిరంజీవి, శివమోహిత్ ల్యాంకోహిల్స్‌లో నివసిస్తున్నారు. ప్రమోద్, హితేష్ సోదరులు. హితేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న ప్రమోద్ డ్యూటీకి వెళ్లగా హితేష్ ఫ్లాట్‌లోనే ఉన్నాడు. అతడికి సోదరుడు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ప్రమోద్ చిరంజీవికి ఫోన్ చేసి తన సోదరుడు ఫోన్ ఎత్తడం లేదని, ఫ్లాట్‌కు వెళ్లి చూడమని చెప్పాడు. అతడు ఫ్లాట్‌కు వెళ్లగా తలుపులు వేసి ఉన్నాయి. తెరిచి చూడగా హితేష్ సీలింగ్ ఫ్యాన్‌కు టవల్‌తో ఉరేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన సోదరుడు హితేష్ ఓ అమ్మాయిని ప్రేమించాడని, నాలుగు నెలల క్రితం వారు విడిపోయారని, అప్పటి నుంచి మనస్తాపంతో ఉన్నాడని ప్రమోద్ ఫిర్యాదులో పేర్కొన్నాడు

ప్రేమ పేరుతో మోసం

యూసుఫ్‌గూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతి మోసపోయింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ బస్తీకి చెందిన ఎ.శ్రీధర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. కొన్ని రోజులు కలిసి తిరిగారు. పెళ్లి చేసుకోమని యువతి నిలదీయగా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన సిబ్బందిపై కేసు

అమీర్‌పేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరిట మహిళను మోసం చేసి డబ్బు తీసుకున్న ఓ సంస్థకు చెందిన సిబ్బందిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన ఎం.ముత్యాలమ్మ విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాన్వేషణలో నగరానికి వచ్చి ఎస్ఆర్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఉద్యోగం కోసం తన వివరాలను జాబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసింది. ఆ తర్వాత లాన్స్ స్టాఫ్ ఇండియా అనే సంస్థ పేరిట ఆన్‌లైన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని మెయిల్ రావడంతో ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూకు హాజరైంది. సంస్థ హెచ్ఆర్‌గా చెప్పుకున్న సత్య అనే యువతి మాట్లాడి సర్టిఫికెట్లను పంపమని అడిగింది. ఆ తర్వాత జయ అనే మరో వ్యక్తి ఫోన్ చేసి కొత్త ఉద్యోగం కోసం ఖాతా తెరవాలని, అందుకు కొంత డబ్బు కావాలని, అలాగే గేట్ పాస్ కోసం మరికొంత పంపాలని మొత్తం రూ.69,500 వసూలు చేశారు. తిరిగి బీమా కోసం డబ్బు పంపాలని అడగడంతో అనుమానపడ్డ బాధితురాలు డబ్బు పంపలేదు. దీంతో వారు ఆమెకు తిరస్కరణ లేఖను పంపారు. బాధితురాలు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం మాయం

యూసుఫ్‌గూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపిన వాహనం మాయమైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ఎ.వెంకటేష్ చిరువ్యాపారి. గత నెల 29న టీవీఎస్ ఎక్స్‌ఎల్ (టిఎస్ 09ఈఎన్ 2937) వాహనాన్ని ఇంటి ముందు నిలిపాడు. మరుసటి రోజు చూస్తే వాహనం ఇంటి ముందు లేదు. గురువారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బోనాలకు ఆలయాలు ముస్తాబు

20, 21 తేదీల్లో చిలకలగూడ, వారాసిగూడలో జాతర



వారాసిగూడలోని పోచమ్మ ఆలయం



మధురానగర్‌కాలనీలో బంగారు మైసమ్మ అమ్మవారు



చిలకలగూడలో విద్యుత్ కాంతులతో కట్టమైసమ్మ పోచమ్మ ఆలయం

బౌద్ధనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో 20, 21వ తేదీల్లో ఆది, సోమవారం ఆషాఢమాస బోనాలు ఘనంగా జరగనున్నాయి. ఇప్పటికే ఆలయాలను విద్యుత్ కాంతులతో సుందరంగా ముస్తాబు చేశారు. చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని చిలకలగూడ, వారాసిగూడ, బీదల బస్తీ, శ్రీనివాస్‌నగర్‌కాలనీ, బౌద్ధనగర్, ఎల్.నారాయణనగర్ తదితర ప్రాంతాల్లోని సుమారు ముప్పై ఆలయాల్లో పండుగను నిర్వహించనున్నారు. చిలకలగూడలోని కట్టమైసమ్మ పోచమ్మ ఆలయంలో జరిగే బోనాలకు సుమారు లక్షమంది భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వేడుకల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్, స్థానిక కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొనున్నారు. రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిలకలగూడలోని కట్టమైసమ్మ, పోచమ్మ అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఆలయచైర్మన్ గుంటి కృష్ణ తెలిపారు. బోనాలు పురస్కరించుకుని ఆలయాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డిలు తెలిపారు.

కట్ట మైసమ్మ-పోచమ్మ ఆలయచరిత్ర

1953లో కానుగుల బాగయ్య నాలుగు పలకరాళ్లతో చిలకలగూడలో అమ్మవార్ల ఆలయాన్ని ఏర్పాటు చేశారు. విశిష్ట పూజలందుకుంటున్న అమ్మవార్లకు బాగయ్య కుమారుడు వెంకయ్య, మరో నలుగురు సభ్యులతో కలిసి చిన్న ఆలయాన్ని నిర్మించారు. ఆలయానికి భక్తుల సంఖ్య పెరగటంతో 1987లో దేవాదాయ, ధర్మదాయశాఖ ఈ ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది.

వారాసిగూడ పోచమ్మ ఆలయంలో..

వారాసిగూడలోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాన్ని ముస్తాబు చేశారు. 1962లో క్రీ.శే. మొలుగు రం మల్లయ్య పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాన్ని నిర్మించారు. బీదలబస్తీలోని రేణుకా ఎల్లమ్మ, వారాసిగూడలోని భూలక్ష్మీ ఆలయం, న్యూఅశోక్‌నగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయం, మధురానగర్‌కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయంలో మొదటగా వెండి బోనం సమర్పిస్తున్నామని చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

చిలకలగూడలోని కట్టమైసమ్మ-పోచమ్మ బోనాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయకార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్ తెలిపారు. ఆలయంలో బోనాలు సమర్పించే మహిళల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్ అధికారులు, వివిధభాగాల అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయ ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పార్టీల నాయకులు సహకరించి ఆషాఢ బోనాలు సవ్యంగా జరిగేలా చూడాలని ఆయన కోరారు. శుక్రవారం ఆలయ ఆవరణలో వడిబియ్యం కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

- మహేందర్‌గౌడ్,
ఆలయ కార్యనిర్వహణాధికారి

మారేడుపల్లి మైసమ్మ ఆలయంలో..

మారేడుపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి మైసమ్మ ఆలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబయ్యింది. 20, 21వ తేదీల్లో జరుగనున్న ఉత్సవాలకు ఆలయం విద్యుత్ కాంతులతో రోడ్లకు ఇరువైపులా స్వాగత వేదికలు, దేవతామూర్తుల ఫోటోలతో మారేడుపల్లి ప్రధాన రహదారి వెలుగులు జిమ్ముతున్నాయి. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు సి.కృష్ణ యాదవ్, తిరుమల వంశీలు ఏర్పాట్లు చేశారు. ఇక్కడి జరిగే బోనాలకు నగర నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వారం రోజుల ముందు నుంచే వస్తుంటారు. ఈ ఉత్సవాలకు పలువురు ప్రముఖులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, హాజరుకానున్నట్లు నిర్వాహకులు సి.కృష్ణయాదవ్, తిరుమల వంశీ వెల్లడించారు.







మారేడుపల్లి రహదారికి ఇరువైపులా రంగురంగుల విద్యుత్ అలంకరణలో దేవతామూర్తులు, స్వాగత వేదికలు, భారీ కమాన్లు



వైట్ టీ షర్టు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగణేష్

విద్యార్థుల కోసం గాంధీజీ సినిమా ప్రదర్శన

సికింద్రాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ సూచనల మేరకు వైట్ టీ షర్టు ప్రోగ్రాంలో భాగంగా గురువారం కంటోన్మెంట్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటీ హాలులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు జాతిపిత మహాత్మాగాంధీ జీవిత చరిత్ర సినిమాను ప్రదర్శించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని, సినిమా ప్రదర్శనను ప్రారంభించారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా కృషి చేసిన మహనీయుడు గాంధీజీ అని ఆయన శ్లాఘించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హైదర్, నాయకులు నరేష్, శ్యాంసన్‌రాజ్, తౌఫిక్, యాదగిరి, నాగేష్‌యాదవ్, సదానంద్, అంజనేయులు, సందీప్, ప్రదీప్ పాల్గొన్నారు.



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న సీఐ భాస్కర్, ఎస్సై సతీష్

పగటిపూట డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు.. ముగ్గురిపై కేసు నమోదు

రెజిమెంటల్‌బజార్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. గురువారం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో పగటి పూట డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఇక నుంచి పగటి పూట కూడా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ఫ్రాంచైజి నిర్వాహకులు, ఇన్‌స్ట్రక్టర్లు

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పద్మారావునగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సిప్ అబాకస్ రీజనల్ ప్రాడిజి పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి పలు బహుమతులు గెలుచుకున్నారని పద్మారావునగర్ ఫ్రాంఛైజి నిర్వాహకులు అనురాధ రజనీకాంత్ తెలిపారు. గురువారం సిప్ అబాకస్ సెంటర్‌లో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. సిప్ అబాకస్ రీజినల్ ప్రాడిజి-2025 పేరిట ఇటీవల కాంపిటీషన్ నిర్వహించగా తెలంగాణకు చెందిన పలు సెంటర్ల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పద్మారావునగర్ సెంటర్ విద్యార్థులు పలు మెడల్స్ ట్రోఫీలను గెలుచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ ఇన్‌స్ట్రక్టర్లు సుచరిత, కవిత, విద్య సంఘమిత్రతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మల్టీపర్పస్ కమ్యూనిటీహాలు వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కమ్యూనిటీ హాలు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

- ఐదేళ్లైన స్లాబ్‌కే పరిమితం
- పట్టించుకోని కార్పొరేటర్

అడ్డగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో కమ్యూనిటీహాలు స్థలంలో నూతనంగా మల్టీపర్పస్ కమ్యూనిటీహాలు నిర్మాణం చేపడతామని ఐదేళ్ల క్రితం శంకుస్థాపన చేసి మధ్యలో వదిలేసిన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.మల్లేష్ తెలిపారు. గురువారం అడ్డగుట్ట కమ్యూనిటీహాలు స్థలంలో మల్టీపర్పస్ కమ్యూనిటీహాలు నిర్మాణం చేస్తామని ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యే పద్మారావు, సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారని ఇప్పటి వరకు స్లాబ్ వరకే పరిమితం అయిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా, ఎమ్మెల్యే పద్మారావు, లేదంటే కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి నిర్లక్ష్యమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డగుట్ట డివిజన్‌లో దాదాపు 49 వేలమంది ప్రజలు ఉన్నప్పటికీ చిన్న చిన్న శుభకార్యాలు జరుపుకోవాలన్నా బయట ఎక్కడో జరుపుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేశారు. గతంలో పలుసార్లు ధర్నా చేసినా ఇంతవరకు ఈ సమస్యను పట్టించుకోకపోవడం సరైన పద్ధతి కాదని నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు అజయ్ బాబు, అంజమ్మ, ప్రభాకర్, బాలయ్య, శంకర్, జగన్ కుమార్, ఫాతిమాలు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



గౌతమ్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై, జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లి ప్రాంతానికి చెందిన గౌతమ్(26) పెయింటింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసగా మారి, జల్సాగా తిరుగుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో గురువారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ప్లాట్ ఫాం నంబరు-1లో తనకు తానే ఎదురుగా వస్తున్న రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



తొట్టెల ఊరేగింపు

తిరుమలగిరి వీకర్ సెక్షన్‌లో నల్లపోచమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు ఘనంగా జరిగింది. యూత్ అసోసియేషన్ సభ్యులు వంశీ, వరుణ్, ఉమేష్, గోపి, రాజారెడ్డిలు పాల్గొన్నారు.

- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి

ఓయూలో 52 మంది బోధనేతర సిబ్బందికి పదోన్నతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం 52 మంది బోధనేతర సిబ్బందికి పదోన్నతులు కల్పించింది. అటెండర్ ఉద్యోగుల నుంచి ల్యాబ్ అటెండెంట్ హోదాలకు పదోన్నతులు పొందిన ఉద్యోగులు పరిపాలనా భవన్‌లోని సెనెట్ హాల్‌లో గురువారం వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చేతులమీదుగా ఉత్తర్వులను అందుకున్నారు. విశ్వవిద్యాలయాల నియమాల ప్రకారం, సమగ్రంగా నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో నిష్పాక్షికంగా, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఉద్యోగులు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ఎస్. జితేందర్ కుమార్ నాయక్, జాయింట్ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

లష్కర్‌లో కుండపోత

పలు ప్రాంతాలు జలమయం

సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గురువారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లలోని పలు కాలనీలు, ముఖ్యంగా నాలా పరివాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. బోయినపల్లిలోని మర్రి రాంరెడ్డి కాలనీ, హర్షవర్ధన్ కాలనీ, సీతారాంపూర్, సికింద్రాబాద్‌లోని మనోహర్ థియేటర్ సమీపంలో, రసూల్‌పురా, అన్నానగర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు చాలాసేపు నిలిచిపోయింది. మోకాలిలోతు వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం కావలసి వచ్చింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



బోయినపల్లి మర్రి రాంరెడ్డి కాలనీలో





సికింద్రాబాద్ మనోహర్ థియేటర్ వెనుక రోడ్డులో వర్షానికి రోడ్డుపై పారుతున్న వర్షపునీరు



బోయినపల్లి సీతారాంపూర్ కాలనీలో అమ్మవారి ఆలయం వద్ద



బోయినపల్లి సీతారాంపూర్ వద్ద



జలమండలి కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రజా సమస్యలపై పోరాటం

పద్మారావునగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించేవరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి కవాడిగూడ దేవీనగర్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను తెలియజేస్తూ బీజేపీ డివిజన్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం మారేడుపల్లిలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు కార్యాలయంలోని అధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. దేవీనగర్ కాలనీలోని డ్రైనేజీ పైపులైన్లు చిన్నవిగా ఉండటం, పాక్షికంగా దెబ్బతినడం కారణంగా స్థానికులు కొంతకాలంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తక్షణమే సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు డిమాండు చేశారు. సికిందరాబాద్ పార్లమెంటు కన్వీనర్ టీ.రాజశేఖరరెడ్డి, హరినాథ్‌నాయి, వై.సురేశ్, కే.ఎమ్.కృష్ణ, ఎస్.రాజు, వై.శ్రీనివాస్ ముదిరాజ్, కిరణ్, రఘురామ్‌లు

బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు

- జోనల్ లెవెల్ కన్వెర్జెన్సీ సమావేశంలో నిర్ణయం



జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

సికింద్రాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆయా ప్రాంతాల్లో జరిగే బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వర్షపునీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ లెవెల్ కన్వెర్జెన్సీ సమావేశంలో నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ అధ్యక్షతన గురువారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జోన్‌లోని కొన్ని ప్రాంతాల్లో బోనాల జాతర జరగనున్నందున తగిన ఏర్పాట్లుచేయాలని, జోన్‌లోని ఆయా సర్కిళ్లలో చెట్ల కొమ్మల తొలగింపు, వర్షాకాలంలో వర్షపునీరు నిలిచే పాయింట్లపై దృష్టి సారించి, వర్షపునీటిని ఎప్పటికప్పుడు తొలగించడం, ప్రధాన కూడళ్లలో రోడ్ల వెడల్పు, అభివృద్ధి పనులు చేపట్టడం, పలు చోట్ల అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడం, బ్లాక్‌స్పాట్‌లు నిర్మించడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ ఏసీపీలు శ్రీనివాస్, శంకర్ రాజ్, జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ ఎస్ఇ (నిర్వహణ) ఆశాలత, సిటీ ప్లానర్ శ్రీనివాస్, ఆయా సర్కిళ్ల ఉపకమిషనర్లు రామానుజరెడ్డి, మారుతీదివాకర్, జాకియా సుల్తానా, అంజనేయులు, డాకు నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వరల్డ్ విజన్ ఇండియా ప్రతినిధి

తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలి

చిలకలగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, గురువులను గౌరవించి, వారు చూపిన బాటలో నడచి ఉన్నత పదవులలో రాణించాలని వరల్డ్ విజన్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ సామ్‌సన్ బంటు అన్నారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం వరల్డ్ విజన్ ఇండియా హైదరాబాద్ ఏరియా డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాగులను,అంగన్‌వాడీలోని చిన్నారులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ పి.వి.కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, సంస్థ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ రోజారాణి, కమ్యూనిటీ మొబిలైజర్స్ ఎల్లస్వామి, సౌందర్య, స్థానిక నాయకులు నరసింహ, ఎలీషాలు పాల్గొన్నారు.

చిట్టీల పేరిట మోసం.. భార్యా భర్తలకు సంవత్సరం జైలుశిక్ష

బౌద్ధనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరిట మోసం చేసిన భార్యా భర్తలకు సంవత్సరం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లు తెలిపిన వివరాల ప్రకారం పార్సీగుట్టకు చెందిన డి.రవీందర్, సుజాతలు భార్యభర్తలు, 2015లో వీరు ఇంటివద్దనే చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ చిట్టీల డబ్బులు సకాలంలో చెల్లిస్తూ స్థానికుల్లో నమ్మకాన్ని కలిగించారు. రాను రాను పెద్ద మొత్తంలో చిట్టీలు ప్రారంభించి ఎక్కువమందిని చేర్చుకున్నారు. కాలపరిమితి ముగిసినప్పటికీ చిట్టీల డబ్బులు చెల్లించకుండా అధిక మొత్తంలో వడ్డీ ఇస్తామని ఆశచూపి 25 నుంచి 40మంది వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసి హఠాత్తుగా ఓరోజు బోర్డు తిప్పేసి దంపతులిద్దరూ పరారయ్యారు. మోసపోయిన బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలు శాంతితో పాటు మరికొందరూ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదుచేసుకుని దర్యాప్తు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారిగా ఎస్సై పెండ్యాల జయశంకర్ వ్యవహరించారు. పరారైన నిందితులను పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి ఆధారాలను కోర్టుకు నివేదించారు. సుమారు పది సంవత్సరాలు పాటు కేసును నడిచింది. వాదోపవాదాలు విన్న తర్వాత సికింద్రాబాద్ 19వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అరుణ గురువారం తీర్పును వెలువరించారు. చిట్టీల పేరిట మోసానికి పాల్పడిన భార్యా భర్తలు రవీందర్, సుజాతలకు సంవత్సరం పాటు జైలుశిక్ష, ఐదువందల రూపాయల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరికి సహకరించిన శంకర్, రాజేశ్వర్‌పై కేసును కొట్టివేశారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జే.భార్గవి, సీడీఓగా బి.శ్రీనివాస్‌లు వ్యవహరించారు.



నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు

పెద్ద కమేలలోని నల్లపోచమ్మ దేవాలయంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల రుక్మయ్య, స్థానిక మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి